క్లుప్తంగా

భక్తులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న కమిటీ సభ్యులు

సుల్తానాబాద్ : కార్తీకమాసం సందర్భంగా మండలకేంద్రంలోని గుడి మిట్టపల్లి శివాలయంలో భక్తులు సోమవారం రుద్రాభిషేకం, క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనంతరం ఆకుల రాములు, రైతులు సురేశ్, రాములు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యాపారులు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

విజయరమణారావుకు మంత్రి పదవి ఇవ్వాలి

ఎలిగేడు: పెద్దపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన చింతకుంట విజయరమణారావుకు రాష్ట్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలని కాంగ్రెస్ నాయకుడు, మండల ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి తాటిపల్లి సతీశ్‌బాబు కాంగ్రెస్ అధిష్ఠానాన్ని కోరారు. సోమవారం ఆయన ఎలిగేడులో మాట్లాడుతూ.. రాజకీయాల్లో 35 ఏళ్ల అనుభవంతోపాటు నియోజకవర్గంలో పార్టీకి పూర్వవైభవం తీసుకొచ్చి కార్యకర్తలను కాపాడిన ఘనత విజయరమణారావుకే దక్కుతుందన్నారు. ఆయనకు మంత్రి పదవి ఇస్తే సరైన గుర్తింపు ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్–17 బాలుర జట్టు రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలకు పెద్దపల్లి ట్రినిటీ విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన క్రీడాకారులను సోమవారం మున్సిపల్ చైర్మన్ మమతా రెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు గద్వాలలో జరుగుతాయని ఇన్‌చార్జి భరత్ తెలిపారు.

ప్రజల తీర్పును గౌరవిస్తాం

రామగుండం: ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు తర్వాత పదేళ్లు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగించిందని పార్టీ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన మక్కాన్‌సింగ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్నామన్నారు. ప్రజల తీర్పును గౌరవిస్తామన్నారు. ప్రజారంజకమైన పాలనను కాంగ్రెస్ ప్రభుత్వం అందించాలన్నారు.

తుపాన్‌తో రైతుల్లో ఆందోళన



ధాన్యంపై టార్పాలిన్లు కప్పిన రైతులు

జూలపల్లి: మండలకేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు ఆకాశం మబ్బులు కమ్ముకోవడంతో ఆందోళన చెందుతున్నారు. రెండ్రోజులుగా తుఫానుతో ఏపీలో వర్షాలు పడతుండడం, ఆకాశం మేఘావృతమై ఉండటంతో అన్నదాతల్లో గుబులు నెలకొంది. వర్షం పడితే ధాన్యం తడుస్తుందన్న భయంతో టార్పాలిన్లు కప్పుతున్నారు.

ప్రత్యేక పూజలు



భజన చేస్తున్న భక్తులు

మంథని: కార్తీక సోమవారం సందర్భంగా మంథనిలోని పోచమ్మవాడలో కొలువుదీరిన శివ నాగేంద్ర గజానన మండలి ఆధ్వర్యంలో నాగేంద్రుడి వద్ద భక్తులు అఖండ భజన నిర్వహించారు. ఆలయాన్ని పూలతో అందంగా అలకరించి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. స్థానికులు, భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

నేడు మండల సమావేశం

రామగుండం: అంతర్గాం మండల సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధికారి భూక్య యాదగిరి సోమవారం పేర్కొన్నారు. సమావేశానికి మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

అంతర్గత రహదారులు అధ్వానం

- ఇళ్లముందే నిలుస్తున్న నీరు
- కాలనీల్లో అస్తవ్యస్తంగా డ్రైనేజీ
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న కాలనీవాసులు



ఇళ్ల ముందుకు కొట్టుకొస్తున్న ఇసుక



కాలనీల్లో ధ్వంసమైన సీసీరోడ్లు

రామగుండం: పట్టణ పరిధిలోని 1, 20, 21, 22వ డివిజన్ల పరిధిలో అంతర్గత రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. పలు కాలనీల్లో డ్రైనేజీ నిర్మాణాలు కూడా చేపట్టడం లేదు. ఇప్పటికే పూర్తిగా మట్టితో కూరుకుపోయి డ్రైనేజీలు నామరూపాలు లేకుండా ఉన్నాయి. నాలుగు డివిజన్ల పరిధిలోని రాంనగర్, ఖాదర్‌కాలనీ, ఇందిరానగర్, మహబూబ్ సుభానీనగర్, పోచమ్మవాడ, ఈఎస్ఐ కాలనీ, భీమయ్య కాలనీ, హౌజింగ్‌బోర్డు కాలనీ, గంగపుత్ర కాలనీ, క్రషర్‌నగర్, ఒరియాకాలనీ, అబాది రామగుండంలోని పోచమ్మవాడ, ముస్లింవాడ, కుమ్మరోళ్లవాడ, అయోధ్యనగర్, బీపీఎల్‌కాలనీ తదితర డివిజన్ల పరిధిలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. వీటన్నింటికీ తోడు కాలనీల్లో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రి వేళల్లో విషసర్పాలు సంచరిస్తుండడంతో కాలనీవాసులు తిరిగే పరిస్థితి కూడా లేదు. వర్షం పడితే వరద నీరు ఎక్కడికక్కడ నిలిచి ఇంటి ముందు మోకాళ్ల లోతు నీరు నిలిచే పరిస్థితి నెలకొంది. కార్పొరేషన్ పరిధిలోని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పన కోసం ఏటా రూ.వంద కోట్లు ప్రత్యేక నిధులు ప్రభుత్వం కేటాయిస్తున్నట్లు పాలకులు చెబుతున్నా కాలనీల్లో మౌలిక వసతులు కానరావడం లేదు.

పిచ్చి మొక్కలతో నిండింది



ఇంటి ముందు పురాతన రైల్వే ట్రాక్ పిచ్చిమొక్కలు, ముళ్ల కంచెతో నిండింది. దీంతో రాత్రివేళల్లో దోమలు, దుర్వాసనతో పాటు విష ప్రాణులు సంచరిస్తున్నాయి. పలుసార్లు పిచ్చి మొక్కలు తొలగించా. పారిశుద్ధ్య సిబ్బందిని కాలనీకి నియమించి చర్యలు చేపట్టాల.

– బాణాల శ్రీధర్, రాంనగర్ కాలనీ

ఇసుక కొట్టుకొస్తంది



ఇళ్లు కడిగే నీటితో పాటు కాలనీల నుంచి వృథానీరు, వర్షపు నీటితో ఇసుక కొట్టుకువచ్చి ఇంటిముందు నిలుస్తోంది. కార్పొరేషన్ నిధులతో కనీసం డ్రైనేజీ నిర్మాణాన్ని పాలకులు చేపట్టడం లేదు. కాలనీ నుంచి ఏటా లక్షల రూపాయలు చెల్లిస్తున్నా పట్టించుకోడం లేదు.

– ఎండీ యూసుఫ్, ఎంఎస్‌నగర్ కాలనీ

వీధిదీపాలు వెలగడం లేదు



కాలనీల్లో వీధిదీపాలు సక్రమంగా వెలుగకపోవడంతో తరచూ వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో రాకపోకలు సాగించాలంటే భయంగా ఉంది. పాలకులు కాలనీలపై ప్రత్యేక దృష్టిసారించాలి. కనీస మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

– ముత్యం సత్యనారాయణగౌడ్, గిర్ని గల్లీ



ప్రమాదమని తెలిసినా పట్టించుకోరా ?

ఓదెల: ఓదెల గ్రామంలోని జగదాంబ సెంటర్‌లో ఇనుప స్తంభానికి విద్యుత్ సరఫరా కావడంతో గ్రామస్తులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బయటకు వెళ్లాల్సి వస్తోంది. పాదచారులు, వాహనదారులతో నిత్యం రద్దీతో ఉండే ఈ ప్రాంతంలో చాలారోజుల నుంచి స్తంభానికి విద్యుత్ సరఫరా అవుతుందని గ్రామస్తులు సిబ్బందికి తెలిపారు. సంబంధిత శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. కాగా ఇనుప స్తంభానికి సంచులు చుట్టి వదిలేశారు. ఉదయం, సాయంత్రం పశువులు కరెంట్ షాక్‌తో మృత్యువాత పడే అవకాశాలున్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మరో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

8న విద్యుత్ వినియోగదారుల సదస్సు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి రైతు వేదికలో ఈనెల 8న విద్యుత్ వినియోగదారుల సదస్సును నిర్వహించనున్నట్లు సోమవారం మండల ట్రాన్స్‌కో ఏఈ శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల లోకల్ కోర్టు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సదస్సులో విద్యుత్ వినియోగదారుల సమస్యలు, లో వోల్టేజీ, ట్రాన్స్‌ఫార్మర్లు మార్చడం, వోల్టేజీ హెచ్చుతగ్గులు, లోపాలు ఉన్న మీటర్ల మార్పు, నూతన సర్వీసుల మంజూరు, అదనపు లోడ్ క్రమబద్ధీకరణ, సర్వీసు పేరు మార్పు తదితర సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉందన్నారు. ఫిర్యాదులను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజలకు అండగా కాంగ్రెస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మంథని: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఆదరించి మంథని ఎమ్మెల్యేగా ఐదోసారి దుద్దిళ్ల శ్రీధర్ బాబును గెలిపించారని, ప్రజలకు ఎల్లవేళలా పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. సోమవారం మంథని ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆదరణ సమష్టి కృషి ఫలితంగానే విజయం సాధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు అయిలి ప్రసాద్, ఎంపీపీ కొండ శంకర్, మంథని అసెంబ్లీ ఎన్నికల మీడియా కన్వీనర్ ఇనుముల సతీశ్, మండల, పట్టణ ప్రచార కమిటీ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్, నాయకులు జనగామ నర్సింగారావు, కుడుదుల వెంకన్న, నూకల బానయ్య, పోలు శివ, ప్రవీణ్, స్వరూప్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, రాజయ్య, ఆజీంఖాన్, తదితరులున్నారు.

చెత్త తొలగింపు



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం దేవునిపల్లిలో శని, ఆదివారాల్లో జాతర ఉత్సవాలు జరిగాయి. లక్షలాది మంది తరలిరావడంతో పడేసిన చెత్తాచెదారాన్ని సోమవారం పంచాయతీ సిబ్బందితో ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్ తొలగించారు. దేవునిపల్లితో పాటు పరిసర గ్రామ పంచాయతీల పారిశుధ్య సిబ్బందితో పనులు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు.

డ్రైనేజీలో ప్లాస్టిక్ వ్యర్థాలు



పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగు నీటి కాలువల్లో చెత్తా చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రైవేట్ ఆసుపత్రులు, హోటళ్లు ఉన్న ప్రాంతాల్లో డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువగా పడేస్తున్నారు. డ్రైనేజీలను శుభ్రం చేయడంలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని వాపోతున్నారు. ఇప్పటికైనా చెత్త, చెదారం తొలగించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

వృథాగా 'భగీరథ' నీరు



ధర్మారం: అధికారుల నిర్లక్ష్యంతో మండలకేంద్రంలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా అందడం లేదు. వివిధ అభివృద్ధి పనుల పేరుతో పనులు చేస్తుండగా పైపులైన్లు ధ్వంసం కావడం, అధికారులు నామమాత్రంగా మరమ్మతు చేస్తుండటంతో తరచూ గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ షిఫ్టింగ్ పేరుతో మూడు నెలల కింద మండలవ్యాప్తంగా భగీరథ నీరు నిలిపివేశారు. ఇటీవల తిరిగి నీటి సరఫరా చేస్తుండగా పట్టణంలో మూడు ప్రాంతాల్లో పైప్‌లైన్లు పగిలిపోయి సరఫరా నిలిపివేశారు. ప్రస్తుతం ధర్మారం నుంచి సాయి మణికంఠ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ పనులు చేస్తుండగా పైప్‌లైన్‌ను తొలగించి తిరిగి రోడ్డు మధ్యలోనే కొత్త పైప్‌లైన్ వేశారు. అయితే నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా తూతూ మంత్రంగా పనులు పూర్తిచేశారు. దీంతో పైప్‌లైన్ లీకేజీ అయి రోడ్డుపై నీరు వృథాగా పోతోంది. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు మరమ్మతు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమష్టి కృషితోనే 'అడ్లూరి' గెలుపు



ధర్మారంలో సమావేశమైన నాయకులు

ధర్మారం: ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యేగా అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించేందుకు సహకరించిన పార్టీ కార్యకర్తలు, ఓటర్లకు మండల కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని గౌతమిబుద్ధ ఫంక్షన్‌హాల్‌లో సోమవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సమావేశంలో మాజీ ఎంపీపీ కొడారి అంజన్న మాట్లాడారు. ఎన్నికల్లో ఇతర పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు సమష్టి కృషితో అడ్లూరి గెలుపునకు సహకరించారన్నారు. నాయకులు చింతల ప్రదీప్‌రెడ్డి, కొత్త నర్సింహం, గాగిరెడ్డి తిరుపతి రెడ్డి, లావుడ్య రూప్లా నాయక్, పాలకుర్తి రాజేశంగౌడ్, బొల్లి స్వామి, కోమటిరెడ్డి రవీందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, దేవి జనార్దన్, సూర్యనారాయణ, కాంపెల్లి రాజేశం, ఓడ్నాల శంకరయ్య, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు మహిళా నాయకురాళ్లు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

ఓదెల: పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పొత్కపల్లి, శానగొండ గ్రామాల్లో ఎస్సై నూతి శ్రీధర్ ఆధ్వర్యంలో సోమవారం వాహనాలు తనిఖీ చేశారు. ఆయా గ్రామాల మీదుగా సుల్తానాబాద్, జమ్మికుంట గ్రామాల వైపులకు వెళ్లే పలు వాహనాలను తనిఖీ చేశారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని పలువురి వాహనదారులకు జరిమానా విధించారు.

ఏళ్లుగా అద్దె భవనాల్లోనే !

- తహసీల్దార్ కార్యాలయం, పంచాయతీలకు సొంత భవనాలు కరువు
- పట్టించుకోని అధికారులు
- కొత్త ప్రభుత్వంలోనైనా నిర్మాణం జరిగేనా?



అద్దె భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం

కమాన్‌పూర్: మండల తహసీల్దార్ కార్యాలయం అద్దె భవనంలోనే అరకొర వసతులతో కొనసాగుతోంది. జిల్లా విభజన ఏర్పాటుకు ముందు జిల్లాలోనే జనాభాలో ఐదో పెద్ద మండలంగా ఉన్న సమయంలో కార్యాలయానికి ప్రజాప్రతినిధులు సొంత భవనం ఏర్పాటు చేయలేదు. దీంతో నేటి వరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతోంది.

మండలంలో 11 గ్రామాలు

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం జిల్లాలు, మండలాల విభజన ఏర్పాటు చేసింది. మండలాల విభజన అనంతరం 11 గ్రామాలతో కమాన్‌పూర్ మండలంగా కొనసాగుతోంది.

పంచాయతీలు అంతే..

కమాన్‌పూర్ మండలం విభజన అనంతరం ప్రభుత్వం నూతనంగా గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేసింది. మండలాల విభజనకు ముందు మండలంలో గ్రామ పంచాయతీలను విభజించడంతో ప్రస్తుతం కమాన్‌పూర్ మండలంలో నూతనంగా ఏర్పాటైన సిద్ధిపల్లె అద్దె భవనంలో, గొల్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో కొనసాగుతున్నాయి.

కొత్త ప్రభుత్వంలోనైనా మోక్షం కలిగేనా ?

పదేళ్లుగా అధికారంలో ఉన్న మండలకేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం, నూతన గ్రామ పంచాయతీలకు భవనాలను నిర్మించలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో ఈ ప్రభుత్వంలో అయినా పక్కా భవనాలు నిర్మిస్తారో లేదోనని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఓవైపు కుక్కలు.. మరోవైపు కోతులు

కాల్వశ్రీరాంపూర్: మండలంలో ఓ వైపు కుక్కలు.. మరోవైపు కోతుల బెడదతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. సుల్తానాబాద్ రోడ్డుపై కోతులు గుంపులుగా ఉండటంతో వాహనదారులు భయపడుతన్నారు. పంటలను ధ్వంసం చేయడంతోపాటు ఇళ్లపై దాడి చేస్తున్నాయి. రహదారుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ దాడికి పాల్పడుతుండటంతో పాదచారులు, వాహనదారులు జంకుతున్నారు.



